# 32.

# ఆత్మవిశ్వాసము - స్వస్వరూప సందర్శనం

**కర్మమార్గంబు విడరాని కాలిబాట**
**భక్తిమార్గంబు సులువైన బండి త్రోవ**
**జ్ఞానమన విమానయాన మరయ**
**యోగమన జలధిపై జను ఓడ కాదె!**

**సౌఖ్యమనుభవింపజాలని లోభికి**
**ఎంత ధనమున్న ఏమి ఫలము!**
**నీరు గతుకు కుక్క కేరెంత పారిన**
**ప్రీతి కలుగబోదు పిసినిగొట్టు!**

పవిత్రాత్మస్వరూపులైన విద్యార్థులారా!

లోకమున ఎట్టి పదార్థమును దక్కించుకొనుటకు ప్రయత్నము చేసినప్పటికిని మొదలు ఆ పదార్థముపై ప్రేమను మనము అభివృద్ధి పరచు కోవాలి. ప్రేమ, శ్రద్ధలు ఉండినప్పుడే అట్టి పదార్థము దక్కించుకొనుటకుగాని, లేక దానిని భద్రపరచుటకుగాని మనము తగిన ప్రయత్నములు సల్పుతుంటాము. ప్రేమ, ఇచ్ఛలు లేకుండిన ఎట్టి దానినైనా మనము అలక్ష్య పరచి, దాని యొక్క క్షేమమునుగాని, దానియొక్క భద్రతనుగాని మనము అంత శ్రద్ధను పూనము. దీనిని పురస్కరించుకొనియే భగవద్గీత "జ్ఞాతుంద్రష్టుంతత్త్వేన ప్రవేష్టుం" అని మూడు పదములు ఉచ్చరించింది. అయితే మనం జ్ఞాతుం విచారణ చేయాలి. దేనిని విచారణ చేయాలి? నేను ఎవరు? ఈ జగత్తు అంటే ఏమిటి? బ్రహ్మమంటే ఏమిటి? అన్ని పదార్థములు కూడను జ్ఞానేశ్వర ప్రకృతి తత్త్వాలని మనం గుర్తించుకోటానికి ప్రయత్నము మనము ప్రప్రథమంలో పూనాలి. అయితే, విచారణ సలిపి, మన తత్త్వాన్ని

sri sathyasai vahini vachanamrutam

మనం తెలుసుకున్నంత మాత్రాన మనకు సంతృప్తి కలుగుతున్నదా? కలుగుటకు వీలు కాదు. మనయొక్క కిచెన్ రూములో తగినంత ఆహారము ఉన్నదని తెలుసుకున్నంత మాత్రమున మన పొట్ట నిండదు. లేక మార్కెట్టులో మనకు ఇష్టమైన పదార్థము ఉన్నది అని విన్న తక్షణమే మనకు తృప్తి చేకూరదు.

**అంధకారంబెల్ల హతమారునే చూడ**
**వసుధలో దీపపు వార్త వలన**
**ఆకొన్నవారికి ఆకలి తీరునా**
**పంచభక్ష్యంబుల పాకము విన్నయంత**

అదే విధముగా ధనహీనునికి ధనంగురించి ఎక్కువగా ప్రోద్బలము చేసినప్పటికిని, ప్రబోధించినప్పటికిని తన దరిద్రము తీరుటకు వీలుకాదు. ఇంక రోగము వచ్చిన వానికి అనేక రకములైన మందుల విషయము వర్ణించినప్పటికిని తన రోగము తీరుటకు వీలుకాదు. రోగమునకు తగిన మందు, ఆకలికి తగిన అన్నము, చీకటికి తగిన వెలుతురును మనము కొంతవరకు సంపాదించు కున్నప్పుడే కొంత తృప్తిని చేకూరుస్తుంది. కనుక, ఈనాడు మనము జీవేశ్వర ప్రకృతి తత్త్వాన్ని తెలుసుకోవటము, తెలుసుకున్న తరువాత దానిని సందర్శించటం అని రెండవ మెట్టుగా తీసుకోవాలి. దీనినే "ద్రష్టుం" అన్నారు. అయితే, మనము చూచిన తక్షణమే ఆనందముగాని, అనుభూతిగాని నిలుపుకోవటానికి వీలుకాదు. దానితో నీవు ఐక్యమైపోయినప్పుడే, దానియొక్క స్వరూపాన్ని, స్వభావమును కూడను నీవు స్పష్టంగా అనుభవించుకోవటానికి వీలవుతుంది. దీనినే "తత్వేన ప్రవేష్టుం" అన్నారు. అందులో ప్రవేశించి, అదియే మనమైపోవాలి. ఇట్టి దీనికి మనము కొన్ని మార్గములు అవలంబించవలసిన అవసరము. దీనినే ఐదు రకములైన ఆకాశములు అని మన వేదాంతము అందిస్తూ వచ్చింది. మొదటిది ఘటాకాశమని, రెండవది జలాకాశమని, మూడవది దహరాకాశమని, నాల్గవది చిదాకాశమని, ఐదవది మహదాకాశమని. అయితే, కరచరణావయవములను పురస్కరించుకొని ఈ పాంచభౌతికమైన దేహతత్త్వమునే తాను విశ్వసించి, 'నేను, నేను' అనబడే తత్త్వమును ఇక్కడ ఘటాకాశమని చెప్పబడుతుంది. అనగా, తన దేహమును, తన స్థానమును, తన

sri sathyasaivachanamrutam

జీవిత తత్త్వమును ప్రధానముగా విశ్వసించి నేను ఫలానావాడిని, నేను ఫలాని లింగమునకు చెందినవాడని, ఫలాని వయస్సు కలవాడను అని ఈవిధమైన దేహము యొక్క గుర్తులను మాత్రమే పురస్కరించుకొని, తనయొక్క వయస్సు, తనయొక్క రూపనామములను కూడను ఉచ్చరించే తత్త్వమునందు, నేను అనే యదార్థమైన తత్త్వాన్ని ఇముడ్చుకుంటాడు. అయితే, రెండవది జలాకాశమైన స్థితి. ఆ సంకల్పస్థానము నుండి వెలువడే తత్త్వములో సంకల్ప మిళితమైన తత్త్వమునకు జలాకాశము అని చెప్పబడుతుంది. దీనికి ఒక చిన్న ఉదాహరణము. ఒక వ్యక్తిని, "నాయనా! నీవు ఎప్పుడు వచ్చావు" అని ప్రశ్నించినప్పుడు 'నేను రాత్రి వచ్చాను స్వామి! అని జవాబు ఇస్తుంటాడు. అయితే రాత్రి రావటము తనయొక్క దేహమే గాని తాను కాదు. దేహమే తాననే భ్రమచేత నేను రాత్రి వచ్చాను' అని దేహమే తాననే స్పష్టము ఈ జవాబులో మనకు అర్థమవుతున్నది. అదే, కొంత సమయము అయినప్పటికి అతనికి కొంత కడుపునొప్పి బయలుదేరుతుంది. కొన్ని నిముషముల లోపల 'స్వామీ! నా కడుపు చాలా నొప్పిగా ఉంటున్నది' అని నాదగ్గర మొర పెట్టుకోవచ్చు. అయితే, ఇక్కడ 'నా కడుపు' అన్న సమయములోపల తాను వేరు అయిపోయినాడు, దేహము యొక్క కడుపు వేరైపోయింది. రాకను గురించి చెప్పే జవాబు 'రాత్రి నేను వచ్చాను' అని చెప్పటము దేహమే తాను అనేది అక్కడ ఒక అర్థము. ఇక్కడ కడుపు నొప్పి గురించి చెప్పేటువంటి విషయములో నా కడుపు నొప్పి తాను వేరు, కడుపు వేరు అని దేహమునకు వేరైపోయిన తత్త్వము ఈ రెండు విధముల అర్థమవుతున్నది. ఈ రెండే. దేహమే నేను అనుకోవటము ఘటాకాశము. దేహము వేరుగా తీసుకొని తాను సాక్షీభూతుడుగా వుండే సంకల్పానికి తగినస్థాయిగా వుండే వ్యక్తి అక్కడ జలాకాశము. ఈ రెండింటిని పురస్కరించుకున్నప్పుడు ఘటాకాశము, జలాకాశము, దేహము, సంకల్పము ఈ రెండింటి ప్రయోగముల తత్త్వము మనకు అర్థమవుతున్నది. ఇంక దహరాకాశము. దహరాకాశము అనగా 'నేను అనే తత్త్వము ఎక్కడనుండి వస్తున్నాది అనే విచారణ లోపల తనయొక్క దేహమును, మనస్సును ఇంద్రియములను, చిత్తమును, అహంకారమును కూడను పురస్కరించుకొని విచారణ సల్పినటువంటి సమయములోపల అక్కడ అంతఃకరణమనే స్థానమునుండి ఈ సంకల్పము సాక్షీభూతుడుగా ఉన్నరీతిగా మనకు అర్థమవుతుంది. దీనినే

sri sathyasai vaahini amrutam

దహరాకాశము అన్నారు. దీనికి మరొక ఉదాహరణ. దేశకాల పాత్రలననుసరించి, కాల కర్మ కారణ కర్తవ్యములను పురస్కరించుకొని మనము విచారణ సల్పటము జగత్తులో ఒక సాధారణ విషయము. కాల కర్మ కారణ కర్తవ్యములను పురస్కరించుకున్నది జాగ్రత్త అని చెప్పటం. నీవు 'ఎప్పుడు బయలుదేరావు ఇంటి దగ్గర'. 'నేను ఐదు గంటలకు బయలుదేరాను'. 'నీవు ఏ మార్గములో వచ్చావు'. 'కారులో బయలుదేరి వచ్చాను'. దీనికి ఒక కారణము. ఇక్కడికి చేరటానికి ఏమి సంకల్పము? 'స్వామిని దర్శించుకోవటానికి'. అయితే అక్కడ ఐదు గంటలకు బయలుదేరినవాడు బృందావనము చేరటానికి గంట టైము పట్టింది. కారులో ప్రయాణమై వచ్చావు. ఇది కర్తవ్యము. కారణము స్వామి యొక్క దర్శనము కోసము. ఇక్కడ ఫలితము ఏమైంది. స్వామి యొక్క దర్శనము అందించింది. కనుక అక్కడ బయలుదేరిన కాలము, బయలుదేరిన రథము, కాలము, అనుభవించినది, ఈ నాల్గింటి ఏకత్వము జాగ్రత్తకు సరియైన అర్థము. ఇంక స్వప్నములోపల, నీవు బృందావనములో పండుకున్నావు. కాని, రాత్రి ఢిల్లీలో షాపింగు చేసినట్లు స్వప్నం వచ్చింది. అయితే, ఈ బృందావనం నుండి ఎప్పుడు నీవు బయలుదేరావు. టైము లేదు. దేనిలో బయలుదేరావు. ఏమి తెలియదు. ఎందుకోసం బయలుదేరినావు? కారణం లేదు. అక్కడ కర్తవ్యము ఒక్కటి మాత్రమే గుర్తులో వుంటున్నాది. అయితే, జాగ్రత్తలో మనస్సు, చిత్తము, ఇంద్రియములు, అంతఃకరణ యొక్క తత్త్వమైన భావము నాలుగుకూడను జాగ్రత్తలో వుంటున్నాయి. కన్నులతో చూస్తున్నాము. దేహముతో ప్రయాణము సలుపుతున్నాము. మనస్సుతో ఆశిస్తున్నాము. హృదయముతో సంతృప్తి పడు తున్నావు. స్వప్నములో నీ దేహము, నీ ఇంద్రియంబులు, నీ కన్నులు, నీ అవయవములు అన్నీ బృందావనములోనే ఉంటున్నాయి. ఒక్క మనస్తత్వము మాత్రము ఢిల్లీలో సంచరించినట్లుగా నీకు గోచరిస్తున్నది. ఇక్కడ, దహరా కాశములో తన సంకల్పములను తాను watch చేసుకుంటున్నాడు, చూచుకుంటూ ఉంటున్నాడు దహరాకాశములో. ఇంక చిదాకాశములో సాక్షిభూతుడుగా ఉంటున్నాడు. ఒకరికి ఒక స్వప్నము రావచ్చును. స్వప్నములో తన దేహమును ఎవరోకొట్టి తలవేరు, మొండెము వేరు చేసి పారవేసి వెళ్లినారు. తలను మొండెమును తానే చూస్తున్నట్లుగా స్వప్నము వస్తుంది. కానీ ఆ సమయములో నీవు దేహమునకు అతీతమైనవాడుగా

sri sathyasai vachanamrutam

ఉంటున్నావు. ప్రాణమునకు అతీతమైన వాడుగా ఉంటున్నావు. నీయొక్క ప్రాణము పోలేదు. దేహముతో సంబంధము లేదు. ఈ దేహమునకు, ప్రాణమునకు అతీతమైన స్థితిలో సాక్షీభూతుడుగా ఉండటమే చిదాకాశం అనే పేరుతో వేదాంతము ప్రబోధించింది. దీనిని ప్రాపంచకంగా మనము యదార్థాన్ని చూచుకోవచ్చును. జగత్తులో స్థూల రూపము ధరించినప్పుడు మనము ఎవరినైనా చిన్న గాటు పెట్టినా, పోలీసు వచ్చి అరెస్టుచేసి అనేక విధములుగా కేసులు రిజిష్టరు చేసుకోవచ్చు. దీనికి ఒక విధమైన ధర్మచట్టము కూడా ఉంటున్నది. అయితే స్వప్నములో ఒక జడ్జిని నీవు హతమార్చినట్లుగా స్వప్నము వచ్చినప్పుడు నీవే పోయి అతనిని హతమార్చి నట్లుగా స్వప్నం రావటంచేత 'అయ్యా! రాత్రి నేను నిన్ను ఖూనీ చేసినట్లు స్వప్నం వచ్చింది' అని చెప్పినను అతను ఏ కేసు పెట్టటానికి వీలుకాదు. కనుక, అవస్థా స్థానములుగాని, అవస్థాకాలములు గాని, అవస్థయొక్క వ్యక్తిత్వములుగాని వేరుగా ఉండటంచేత తాను ఒకవిధమైన సాక్షిభూతుడుగా ఉంటున్నాడు ఈ చిదాకాశములో. దేహమునకు, మనస్సునకు, బుద్ధికి, ఇంద్రియములకు, చిత్తమునకు, అహంకారమునకు కూడను తాను భిన్నుడై ఉంటుంటాడు. ఇంక మహదాకాశము. ఇది నిర్వికల్ప స్థితియందు మాత్రమే అర్థమవుతుంది. ఇట్టి నిర్వి కల్పస్థితిని అందరు అందుకోవటం సాధ్యం కాదు. దీనికి ఒక హద్దులని గాని, దీనికి ఒక మార్గమనిగాని నిర్ణయించుటకు సాధ్యము కాదు. అది మన సాధన సంపత్తిపైన ఆధారపడి ఉంటుంది. దీనిని కూటస్థ లక్షణమని మరొక పేరు. కూటస్థమనగా ఏమిటంటే నీవు నోటితో ఒక పాటను పాడుతూ నీ చెవులతోనే ఆ పాటను వింటూ ఈ శబ్దము ఎక్కడనుండి వస్తున్నాది అని శబ్దమును లక్ష్య పరచుకొని శబ్దముయొక్క ఉత్పత్తిస్థానమందు నీ మనస్సును ఇమిడ్చిన సమయము నందు దీనికి కూటస్థ లక్షణమని చెప్పవచ్చు. కొంతమంది దీనినే సమాధిస్థితియని చెబుతుంటారు. సమాధి అనేది మానసిక లక్షణమేగాని, మనస్సుకు అతీతమైనది కాదు. అనగా సమాధి మంచి చెడ్డలు, సుఖ దుఃఖములు, చీకటి వెలుగులు, వేడి చల్లదనములు రెండింటిని సమస్థితిలో మనము అనుభవించుకునే పరిస్థితికి సమాధి అని చెప్పవచ్చును. దీనిని పురస్కరించుకొనియే అర్జునుడు విశ్వోపాసకుడు గొప్పయా, లేక క్షేత్రజ్ఞోపాసకుడు గొప్పా' అని కృష్ణుని ప్రశ్నించాడు. అనగా అక్షరోపాసకుడు

srisathyasaivachanamrutam

నిర్గుణోపాసకుడని, విశ్వోపాసకుడు సగుణోపాసకుడని, సగుణ నిర్గుణ ఉపాసనలను పురస్కరించుకొని భక్తిమార్గమును కొంతవరకు (ప్రోద్బలము చేసుకుంటూ వచ్చారు.) ప్రోత్సహించుకుంటూ వచ్చారు. అయితే, సగుణోపాసన గొప్పదా, నిర్గుణోపాసన గొప్పదా అని ఈ ఉపాసనలను పురస్కరించుకొని అనేక మంది వాదోపవాదములు జరుపుతుండటం మన దేశములో ఒక వికారమైన లక్షణం. ఇందులో సగుణ నిర్గుణోపాసన అని మధ్యలో ఒకటి చేరుతుంటుంది. అయితే ఇవి సాధనల యొక్క భేదమేగాని లక్ష్యము మాత్రము మూడింటికి ఒక్కటియే. దీనికి సాపేక్షిక శబ్దములని కూడా ఒక అర్థము. అయితే, సగుణోపాసన, నిర్గుణోపాసన, సగుణ నిర్గుణోపాసన యొక్క తత్త్వాన్ని సులభంగా మీకు అర్థం కావాలనుకున్నప్పుడు సగుణోపాసకుడు బట్టయొక్క దృష్టిగా ఉంటుంటాడు. వస్త్రదృష్టి సగుణోపాసన. సగుణ నిర్గుణోపాసన దారము దృష్టి. నిర్గుణోపాసన ప్రత్తి దృష్టి. అయితే ఇది వస్త్రమని, అది దారమని, అది ప్రత్తి అని మూడు రకములైన పేరులు, మూడు రకములైన వినియోగములు మనము అనుభవిస్తున్నామే గాని మూడింటియందు పదార్థము ఒక్కటియే. ప్రత్తి నుంచి దారము, దారమునుండి వస్త్రము. తిరిగి దారము తీస్తే వస్త్రము లేదు. దారము విడదీస్తే అంతా ప్రత్తిగానే మారిపోతుంది. పైన ఉన్నది ఏమిటి అని ప్రశ్నించినప్పుడు, మీరు వస్త్రము అని చెప్పవచ్చును. లోనున్నది ఏమిటంటే ప్రత్తి అని మీరు అనవచ్చును. వేదాంతము లోపలఉన్నది, బయటఉన్నది ప్రత్తే అని నిర్ణయము చేస్తుంది. కనుక, సగుణ, నిర్గుణ, సగుణోపాసనలనేవి మూడింటి యందు ఒక్క ప్రేమ మాత్రమే ఏకత్వమైన స్థానమును అలంకరించుకుంది. ఈ ప్రేమ అనే దానిని మనము హృదయమునందు నింపుకున్నప్పుడు ఏమార్గమునందైనా ఆ గమ్యమును చేరటానికి వీలవుతుంది. అయితే, ఈ ప్రేమనే ప్రియమని కూడను పిలుస్తూ వచ్చారు. ఎట్టి సమయమునందు ప్రియమని పిలుస్తారంటే మనకు యిష్టమైన వ్యక్తినే లేక యిష్టమైన పదార్థమునే మనము చూచినప్పుడు కలిగేటువంటి సంతోషమునకు ప్రియము అని పేరు. అయితే, అట్టి ప్రియమైన వస్తువును చూచినప్పుడు దానిని కొంతవరకు దగ్గర చేసుకోవటం లోపల వచ్చిన ఆనందమునకు మోదము అని పేరు. అయితే, ఆ ప్రియమైన వస్తువును మనము అనుభవించేటప్పుడు కలిగేదానికి ప్రమోదము అనిపేరు. అనగా ప్రియము,

మోదము, ప్రమోదము మనకు యిష్టమైనది చూచినప్పుడు మాత్రము కలిగేది ప్రియము. చూచిన దానిని దగ్గర తెచ్చుకోవటము అనేది మోదము. దగ్గరకు తెచ్చుకున్న దానిని అనుభవించుకోటం ప్రమోదము. అనుభవించిన తరువాతనే ఆ పదార్థము నీవు ఏకమైపోతావు. ఈ ఏకత్వములో కలిగే ఆనందమే కూటస్థ లక్షణము. అయితే భగవంతునికి సగుణోపాన ప్రీతియా, నిర్గుణోపాన ప్రీతియా, సగుణ నిర్గుణోపాసన ప్రీతియా అని మనము చక్కగా విచారణ చేసినప్పుడు ఈ మూడు కూడను తనకు ప్రీతియే. అయితే భాషయందు మాత్రమే మనము భేదములు తీసుకుంటున్నాము, భావమునందు అంతరార్థమును విచారించుకొనక, బాహ్యమునే లక్ష్యమునందు పెట్టుకుంటున్నాము. బాహ్యప్రియులు లోకులు, భాషప్రియులు లోకులు, భావప్రియుడు భగవంతుడు. కనుక భగవంతుడు భావమును మాత్రమే చూస్తాడు గానీ, నీ భాషనుగాని, నీ బాహ్యము గానీ తాను ఏమాత్రము లక్ష్యము చేయడు. ఆర్తుడై ప్రార్థించటమే భగవంతునికి ప్రీతి. అంతేగాని ఏవిధముగా తాను ప్రార్థిస్తున్నాడు, ఎంత నైవేద్యం పెట్టాడు, ఎంత పెద్ద హారము తెచ్చి నాకు వేశాడు అనేటటువంటి తుచ్ఛ లక్షణాలు భగవంతుని యందు కనిపించటానికి ఏమాత్రము వీలుండదు. ఒక బిడ్డను ఊయలలో పండబెట్టి తల్లి పైన పని చేసుకునే సమయంలోపల బిడ్డ లేచి ఏడ్వవచ్చు గాని తల్లి బిడ్డఏడుపు విన్న తక్షణమే పరుగెత్తివస్తుంది గాని, బిడ్డ ఏడుస్తున్నది, ఏ రాగానికి వస్తుంది, ఆ ఏడుపు. ఏ తాళానికి వస్తుందని తల్లి చూస్తుందా? చూడదు. అదేరీతిగా తన బిడ్డలైన వ్యక్తులు ఆర్తితో ప్రార్థించిన తక్షణమే తల్లి ఏరీతిగా దిగి వస్తుందో అదేవిధముగా భగవంతుడు కావాలని, హృదయపూర్వకమైన ఆర్తితో ప్రార్థనలు సల్పినప్పుడు తాను ఏవిధమైన సాధనలు చేశాడని చూడక వచ్చి రక్షించటానికి నిరంతరము సంసిద్ధుడై ఉంటాడు. భగవంతునికి ఎట్టి భేదములు ఉండవు. గుణ రహితమైన భగవంతునికి గుణములు కల్పించటము మనయొక్క దృష్టి దోషములే, భావ దోషములే. ఒక చిన్న ఉదాహరణము. ఒక తల్లికి ముగ్గురు బిడ్డలుంటారు. ఆ బిడ్డలలో పెద్దవాడు కొంత వయస్సు కలిగినవాడు. కనుక తనకు ప్రపంచ విషయములు కొంతవరకు అర్థము చేసుకోవటం వీలవుతుంది. రెండోవాడు ఏదో మధ్యస్థితిలో ఉంటాడు. మూడవవాడు అతి చిన్నవాడు. అయితే ఒకానొక సమయంలో ఏదో కొన్ని అవాంతరములు రావటంచేత

srisathyasaivachanamrutam

గవర్నమెంటు వారు ఒక విధమైన నిర్బంధములు విధించవచ్చును. ఇంటికి ఒక వ్యక్తిని యుద్ధములో చేర్చాలి అని నిబంధన జరుగవచ్చును. ఆ సమయములో గవర్నమెంటు ఆఫీసరు వచ్చి ఆ తల్లిని అడిగినప్పుడు 'మీ ఇంటి నుండి ఎవరినైనా ఒక వ్యక్తిని యుద్ధానికి పంపించాలి' అన్నప్పుడు అందరి బిడ్డలపైన తనకు సమానమైన ఆశయే, ఎవ్వరిని పంపటానికి తాను ఒప్పుకోదు. కాని ఈ ప్రభుత్వము యొక్క నిబంధనల వల్ల తాను పెద్దవాడినే పంపుతుంది గాని కడవాడిని పంపదు. ఇంతమాత్రమున చేత ఆ తల్లికి పెద్దవానిపై ప్రేమలేదని లేక కడవానిపై ప్రేమ ఉందని కాదు. పెద్దవాడికి ప్రపంచ విషయములో కొంతవరకు అర్థము చేసుకునే శక్తి ఈ ప్రపంచములో మెలిగేటువంటి విధానము అతనికి తెలుసు కనుక అలాంటి వానినే నిర్బంధముతో పంపటానికి పూనుకుంటుంది. అంత మాత్రమున తల్లికి ప్రేమ లేదని కాదు. అదే విధముగా భగవంతునికి సగుణభక్తుడు, సగుణ నిర్గుణ భక్తుడు, నిర్గుణ భక్తుడు ఈ ముగ్గురు బిడ్డలవంటివారే. అయితే సగుణ భక్తుని తాను చంటిబిడ్డవలే చూచుకోవటము ఒక లక్షణము. కనుక భగవంతుడు సగుణ నిర్గుణులపైన ఎక్కువ ప్రీతిగా ఉంటాడు. సగుణోపాసకుడు భగవంతునికి చిన్న బిడ్డవంటివాడు. నిర్గుణో పాసకుడు పెద్ద బిడ్డవంటివాడు. సగుణ నిర్గుణోపాసకుడు మధ్య బిడ్డ వంటివాడు. ఈ సగుణోపాసకుడు సర్వము భగవంతునికి అర్పితమైన భావముతో భగవంతుని యొక్క రూపనామ లీలలు వర్ణించుకుంటూ తమ జీవితమును ఆనందములో ముంచి తన జీవితమును అంకితము చేసుకుంటాడు. చంటిబిడ్డయొక్క సర్వ పనులు బిడ్డ కోరక మునుపే ఆ కాలమునకు ఆహారమునందించటము, ఆ సమయమునకు స్నానము చేయించటము, ఆయా సందర్భములందు డ్రస్సులు వేయటం అంతా తల్లి ఏరీతిగా చూచుకుంటుందో అదేవిధముగా సగుణోపాసకులైన వారిని భగవంతుడు సర్వవిధముల ఆ ధర్మమునందించి అనేకవిధముల ఆనందమునందించే నిమిత్తమై తానే స్వయంగా చూచుకుంటాడు. మంచి చెడ్డలు గాని, ఇష్టా అయిష్టములుగాని, రాగద్వేషములుగాని, ఎట్టివి లేక సర్వ సమత్వమైన భావము ఒక్క చంటిబిడ్డకు మాత్రమే ఉంటుంది. తనకు ఏ సమయంలో ఆహారము తీసుకోవాలనిగాని, ఏ సమయంలో గుడ్డలు వేసుకోవాలని గాని ఏమీ యోచించదు. అంతా

తల్లిపైననే ఆధారపడి ఉంటుంది. కనుక అట్టి స్థిరత్వమైన, నిర్మలమైన భావమునందు ఉన్న స్థితియే శరణాగతి. అర్థము లేని పదములు కూడను మనము వినియోగిస్తున్నాము. ఈ శరణాగతి అనగా

**మదీయ ధనదారాది సర్వభార సమర్పితం**
**ఆత్మానాం శేషభూతంహి రక్షమాం శరణాగతిః**

అంటాము. అనగా నా దేహము, నా మనసు, నా బుద్ధి, నా ఆస్తి సర్వము నీకు అర్పితము చేస్తున్నాను స్వామీ! అని చెప్పటం చాలా సులభం. ఇది సత్యమైన పదమేనా? కాదు. ఇది కేవలము భగవంతుని కూడా దగా చేసే పదములు. అనగా నా దేహము నీకిస్తున్నాను, నా మనస్సు నీకు ఇస్తున్నాను. ఈ రెండు పదములే నీకు చాలు. నా మనస్సును నీకు ఇస్తున్నాను అని చెప్పే దీనిలో ఎంత అసత్యముంటున్నది. నీ మనసు నీ స్వాధీనములో లేకుండా నిన్నే అనేక రకములుగా తబ్బిబ్బు ఒనరించుకునే సమయములో ఆ మనస్సును భగవంతునికి ఇస్తున్నామంటే కేవలము ఒక తాత్కాలిక తృప్తి అని చెప్పవచ్చు. శరణాగతి అనగా అది కాదు. సర్వత్రా ఈశ్వరత్వమనేది అంతర్భూతమై ఉంటున్నాదని మనము గుర్తించుకుంటే అదే శరణాగతి. సర్వత్రా ఈశ్వరత్వాన్ని మనము విశ్వసించినప్పుడు ఇంక రెండవ పదార్థము లేదు. రెండవ పదార్థము ఉంటేకదా శరణాగతి పదమునకు విలువ. సర్వత్రా తానే ఉంటున్నప్పుడు శరణాగతి చేసేవాడు ఎవరు? చేయించుకునేవాడు ఎవరు? అక్కడ ఇంక రెండవ పదార్థము ఉండదు. రెండు ఉన్నచోటే మనకు ఈవిధమైన పదము ఉపయోగపడవచ్చును. రెండుగా లేని ఏకత్వ భావనయందు ఈ శరణాగతి అనే పదమునకు కూడా స్థానము లేదు. కనుక అట్టి ఏకత్వమును మనము అనుభవించుకోవటానికి మన ప్రేమను దిన దినము పరిశుద్ధమైనదిగను, ఏకత్వమును పొందే మార్గముగను ఏర్పాటు చేసుకోవటానికి పూనుకోవాలి. కనుక, ఏ ప్రేమ నుండి ఈ ప్రేమ వచ్చినదో, ఆ ప్రేమలో ఈ ప్రేమను చేర్చే పరిస్థితికి తగిన సాధనలు మనము అలవర్చుకోవాలి.

గోప గోపాలురందరు అట్టి ఏకత్వాన్ని అనుభవించే ప్రయత్నమునకు మాత్రమే

srisathyasaivachanamrutam

పూనుకొని వారి దేహమునకు, మనస్సునకు, సంసార సంబంధములకు, ఎట్టి దీనికి వారు వెఱువక, లొంగక, కృంగక ఒక్క భగవంతునికి అర్పితము చేసుకునే దాంట్లో సంసిద్ధులై ఉంటున్నారు. ఒకానొక సమయంలో రాధ ప్రార్థించిందట. 'కృష్ణా! ఈ ధర్మమును పురస్కరించుకొని నర రూపము ధరించి ఈ మర్త్యలోకములో నీవు జన్మించవచ్చును. కాని, ఏ కాలములో ఏ రూపమును అందుకుంటావో చెప్పుటకు సాధ్యము కాదు. అలాంటి సమయములో మత్స్య, కూర్మ, వరాహ, వామన రూపములు కూడను నీవు ధరించటము కద్దు. కనుక నీవు ఏ రూపమైనా ధరించు, ఏ రూపము ధరించినా కూడను, ఆ రూపమును ఏకత్వపరచే జన్మము నాకిమ్మని కోరింది. అయితే, ఇది ఎట్లా సంభవిస్తుంది?

**పుష్పంబువై నీవు పాలుపొందుచుండిన – తుమ్మెదనై నే తిరుగుచుందు**
**వృక్షంబువై నీవు వర్ధిల్లుచుండిన – వల్లికనై నిన్నల్లుకొందు**
**అనంత ఆకాశమే నీవైన – చిన్న చుక్క నేనై నీలోన చెలగుచుందు**
**మేరు పర్వతమే నీవైన – పరచుకొని పారెడ సెలయేరునై**
**వర సముద్రుడే నీవైన – వాహినియౌచు నీలోన ఐక్యమగుదు**

కనుక, ఈవిధముగా నీలో వచ్చి చేరే అవకాశాన్ని ఇమ్మని రాధ కోరంది. కనుక, ఇట్టి ఏకత్వమైన దానిలో వారు ప్రేమోన్మత్తులైన హృదయులు కనుక అట్టి పవిత్రమైన బావములే వారికి ఉద్భవిస్తుంటాయి. ఇలాంటి పవిత్రమైన ఈ గోపికలయొక్క భక్తిని ఎంత వర్ణించినా తనివి తీరదు. అయితే ఇట్టి పవిత్రమైన అర్థములకు నానార్థములు కల్పించి, అనర్థములను మాత్రమే తీసుకొని యదార్థమును ప్రక్కకునెట్టి భారతీయ సంస్కృతిని లేక భాగవతము యొక్క తత్త్వమును కేవలము హాస్యాస్పదముగా చూచేటువంటి భారతీయులు కూడను మన భారతదేశములో దినదినానికి అభివృద్ధి అయిపోతున్నారు. మూఢుల యొక్క హృదయము ముకుళించి ఉంటుందట. అలాంటి హృదయము వికసించటము లేదు. దానియొక్క పరిమళము పరులకు అందించటము లేదు. దీనినే ఒక కవి చెప్పాడు 'అడవిలో మల్లెలు పూసేమి ఫలము, పంజరములో చిలుక కులుకేమి ఫలము' అని. అనగా ఆ మల్లెలు ఊరిలో పూచిన ఎవరైనా వాసన చూడగలరు, ఎవరైనా తలలో పెట్టుకొనుటకు వీలుంటుంది.

sri sathyasai vachanamrutam

అడవిలో పూస్తే ఎవరు పెట్టు కుంటారు, ఎవరు వాసన చూస్తారు? అట్టి జీవితము ఈ ముకుళించిన మూర్ఖుల యొక్క జీవితము. ఆధ్యాత్మిక తత్త్వమందుగాని, పవిత్రమైన భగవత్త్వమందుగాని హృదయము ఏమాత్రము అందులో లీనము కావటానికి పూనుకోదు. అయితే కొంతమంది జ్ఞానులు వారి హృదయమనే పుష్పమును వికసింపజేసుకొని ఈ భగవత్ తత్త్వము గ్రహించటానికి మాత్రమే పూనుకుంటారు. భగవదర్పితమైన చిత్తమునకు ఇంక విచారించవలసిన తత్త్వము లేదు, తాను వినవలసిన తత్త్వములు ఉండవు. కనుక మన హృదయాలను ప్రేమతో తనకు అర్పితమైనది గానో లేక తన హృదయవాసియైన వాడు భగవంతుడనే భావముతోనో మన నిత్య కర్తవ్యములను మనము పూనుకోవటంలో ఇదియే శరణాగతి యొక్క లక్షణమని విశ్వసించవచ్చును. దీనినే ఆస్తిక, నాస్తిక, ఆస్తికనాస్తిక అనే పేరుతో ఈ ప్రకృతిలో భగవత్ తత్త్వములు కొంత తబ్బిబ్బైన మార్గములో నడుస్తూ వచ్చాయి. దీనికి ఒక ఉదాహరణము. ఒక పొదలోపల ఒక చక్కని పుష్పము ఉంటున్నాది. ఆ పుష్పము యొక్క పరిమళము మనకు వస్తున్నది. ఆ పరిమళమును ఆధారం చేసుకొని ఆ పొద దగ్గరకు వెళ్ళి ఎక్కడ ఉంటున్నాది ఇది అని మనము వెతుకుతూ వెతుకుతూ వెదుతున్నాము. అయితే వాసన మాత్రమే ఆధారము చేసుకొని ఆ స్వరూపాన్ని అందుకొనే నిమిత్తమై ఎవరు ప్రయత్నములు చేస్తుంటారో వారు ఆస్తికులు అని పిలువబడుతారు. అయితే కొంతమంది వాసన వస్తున్నాది ఆ పుష్పము ఎక్కడ వుందో అని వెతక్కుండా వాసన మాత్రమే అనుభవిస్తుండేవారు ఆస్తికనాస్తికులన్నారు. అయితే కొంతమందికి గాఢమైన పడిశము పట్టి వాసనే రానటువంటివారు ఉంటున్నారు. అలాంటి వారు పుష్పము వాసనగాని, పుష్పము కోసముగాని ఏమీ ప్రయత్నం చేయకుండా ఉంటారు. వారినే నాస్తికులు అన్నారు. అయితే నాస్తికులంటే దేవుడంటే విశ్వాసము లేనివారని మనము భావిస్తున్నాము. అదికాదు నాస్తికత్వానికి సరియైన అర్థము. ఆత్మ విశ్వాసములేని మానవుడు జగత్తునందు పుట్టటానికి వీలుకాదు. ఆత్మవిశ్వాసము కలిగినవారు అందరు ఆస్తికులేగాని నాస్తికులు కాదు. ఆస్తికత్వము లేక నాస్తికత్వము నిలవటానికి వీలుండదు. దీనినే మీరు ఇంగ్లీషులో there is no God అంటారు భగవంతునిపై విశ్వాసము లేని వారు. అయితే there is మొదలు వచ్చింది. No God తరువాత వచ్చింది. ఇంకొక పదముగా, గాఢమైన

srisathyasaivachanamrutam

నక్సలైట్సుగా వుండేవారైతే God is no where. నాలుగు పదములుగా ఉంటున్నాయి. No అనేది where అని ఉంటున్నాయి. Where అనే పదములోని w, no కి చేరిస్తే God is now here అయిపోతుంది. కనుక God is no where అనే దానిలోను, God is now here అనే దానిలోను కొత్త w తెచ్చిపెట్టలేదు, ఉన్న w ని తీసుకుని పోలేదు. ఇది words magic గాని ఇది నిజమైన నాస్తికత్వము కాదు. కనుక God is now here అనేదే వాని భావతత్త్వము God is no where అనేది వీని భావతత్త్వము గాని రెండింటి యందు వుండినది వారి భావతత్త్వమే తప్ప భగవంతునిలో మార్పు ఏమాత్రము ఉండదు. జాండిస్ వచ్చిన వ్యక్తికి అంతా yellow కలర్‌గానే కనిపిస్తుంది. అది కేవలము తాత్కాలికమైన రోగమే గాని అది సత్యదృష్టి కాదు. ఇంక మలేరియా ఉన్న వ్యక్తికి లడ్డు తిన్నా చేదుగానే ఉంటుంది. అది కేవలము తన నాలుక తప్పేగాని లడ్డు దోషము కాదు. భగవంతునిపై అవిశ్వాసము కూడా ఒకరోగమే. ఒక చిన్న ఉదాహరణ. ఒక పెండ్లి లోపల అనేకమంది బంతులు తీరి భోజనాలకు కూర్చున్నారు. సరే! అన్ని పదార్థములు వడ్డించారు. లడ్డు తీసుకుని వడ్డిస్తున్నారు. ఒకటి రెండు వడ్డించుకుంటూ పోయారు. కొంతమంది నాకు వద్దు అన్నారు. అయితే లడ్డుపైన వారికి ఇష్టము లేక కాదు వారు వద్దని చెప్పేది. వారికి sugar factory డయాబిటీసు ఉంది. వారికి లడ్డు తినాలని ఆశయే కాని లోపల జబ్బు వుంది కాబట్టి వద్దు వద్దు అంటున్నారు. కనుక, తనలో రోగము ఉండటం చేత లడ్డు వద్దంటున్నాడే గాని తినాలని తనకు కూడా ఆశనే. ఇలాంటి వారే నాస్తికులు. లోపల ఆశ ఉంటుంది. బయట తట్టు నాస్తికత్వమనే విశ్వాసము లేకపోవటం చేత, ఆరోగ్యమనే దానివల్ల వద్దు అంటున్నారు. అయితే, ఇంకా కొంతమంది మూర్ఖులు, జబ్బువున్నవారు వద్దంటే జబ్బులేని వారు కూడా వద్దు అంటారు. ఇలాంటి మూర్ఖత్వమే దినదినానికి అధికమైపోతున్నది. అతనికి నమ్మకం లేకపోతే అతనే పోతాడు. అతనిని నేను అనుసరించటమా? నాకు నేనైనా బానిస కావాలి, లేక భగవండుడికైనా బానిస కావాలి. వీనికెందుకు నేను బానిస కావాలి? వీని మాటలు నేనెందుకు నమ్మాలని నీకు నీపైన విశ్వాసము అభివృద్ధి పరచుకోవాలి లేక దైవము పైన అయిన విశ్వాసము అభివృద్ధి పరచుకోవాలి. రెండూ లేకుండా ఎవరో మూర్ఖుడు వద్దంటే నీవూ వద్దని పోవడంలో నీ మూర్ఖత్వము తేటతెల్లమైంది. కనుక, నీకు

sri sathyasai vachanamrutam

నీవు ఆత్మవిశ్వాసాన్ని అభివృద్ధి పరచుకో. Self confidence develop చేసుకున్నప్పుడు self satisfaction వస్తుంది. Self satisfaction వచ్చినప్పుడు self sacrifice చేస్తాం. Self sacrifice చేసినప్పుడు self realisation వస్తుంది. కనుక ఈ self realisation self confidence పై ఆధారపడి ఉంటున్నది.

**(తేదీ 17-06-1973 న సాయంకాలం బృందావనంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam